జగనన్న సురక్షతో సంక్షేమానికి రక్ష

- సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


పిడుగురాళ్లలో సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



అడిగొప్పలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న డెప్యూటీ కలెక్టర్ శ్రీరామచంద్రమూర్తి

పిడుగురాళ్ల: సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 12వ సచివాలయంలో జగనన్న సురక్ష పథకంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సర్టిఫికెట్ అవసరమవుతూనే ఉంటుందన్నారు. 2019 ముందు ఏ సర్టిఫికెట్ కావాలన్నా ప్రజలు ఎంతో అవస్థలు పడేవారన్నారు. జగనన్న పాలనలో ఎలాంటి అవసరం లేకుండా ప్రతి సర్టిఫికెట్ వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి అందజేస్తున్నారని తెలిపారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా సీఎం జగన్ ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ఇంకా అందని వారు ఎవరైనా ఉంటే వాటిని వెంటనే అందించేందుకు జగనన్న సురక్ష అనే మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వివరించారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని ఆయన తెలియజేశారు. అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చామని, మరలా మిగిలిన మరో 15 వందల మందికి వచ్చే వారంలో ఇవ్వబోతున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, కౌన్సిలర్లు జడ సురేంద్ర బాబు, గర్నె నాగేశ్వరరావు, నేలటూరి బాలరాజు, జేసీఎస్ కన్వీనర్ జూలకంటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ కాలే మాణిక్యరావు, కో–ఆప్షన్ సభ్యులు పిల్లి ప్రేమానందం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరభద్రుని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు గొట్టిముక్కల పవన్‌రెడ్డి, నేలటూరి అనిల్, రేటపాళ్ల జార్జి, యర్రం సామేలు పాల్గొన్నారు.

అర్హులకు నూరు శాతం ప్రభుత్వ పథకాలు

మాచర్ల రూరల్: అర్హత ఉండి ఏ కారణం చేతనైనా జగనన్న నవరత్న పథకాలు అందని లబ్ధిదారులకు జగనన్న సురక్ష పథకం ద్వారా అందించేందుకు అధికారులంతా కదిలి వచ్చారని ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండలంలోని గన్నవరం, కంభంపాడు గ్రామాల్లో జగనన్న సురక్ష పథకంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేసి ఆయన మాట్లాడారు. అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే జరిపి అర్హత కలిగిన వారికి సర్టిఫికెట్లు అందించటం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మండ్లి మల్లుస్వామి, మండల ప్రత్యేకాధికారి గబ్రూనాయక్, మండల ఉపాధ్యక్షులు పోతురెడ్డి సుజాత, సర్పంచులు ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, కందుల శివారెడ్డి, ఆరికట్ల చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ శేరెడ్డి వీరారెడ్డి, తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్, ఎంపీడీవో కోటేశ్వరరావు, ఎంఈవో వేముల నాగయ్య, ఏఈలు సురేంద్ర, బాబునాయక్ పాల్గొన్నారు.

జగనన్నే ప్రజలందరికీ రక్ష

దాచేపల్లి : జనం మేలుకోరే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ రక్ష అని జెడ్పీటీసీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నగర పంచాయతీతో పాటు మండల వ్యాప్తంగా శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సమస్యలు ప్రజల నుంచి రావడంతో వాటిని అక్కడికక్కడే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమాల్లో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, వైస్ చైర్మన్లు షేక్ మస్తాన్‌బీ, కొమెరబత్తిన అన్నపూర్ణ, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, తహసీల్దార్ టి. ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో శోభారాణి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి పరిష్కారం

కారెంపూడి: మండలంలోని చినగార్లపాడులో జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం చైతన్యవంతంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు తలమునకలయ్యారు. వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపి వారికి ధ్రువపత్రాల్ని పంపిణీ చేశారు. మొత్తం 11 రకాల సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన 52 అర్జీలను అధికారులు పరిష్కరించారు. మరో వైపు జగనన్నకు చెబుదాం, అర్జీల రిజిస్ట్రేషన్ డెస్క్‌లను కూడా ఏర్పాటు చేశారు. ఉచిత వైద్య శిబిరాన్ని గాదెవారిపల్లె పీహెచ్‌సీ వైద్యులు సిబ్బంది నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జోసెఫ్‌కుమార్, ఎంపీడీఓ జి. శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జి. శ్రీనివాస్, ఈఓఆర్డీ పి. సత్యప్రసాద్, డీటీ సుధామాధురి, మండల సర్వేయర్ సులేమాన్‌ఖాన్, ఎంపీపీ మేకల శారద, గ్రామ సర్పంచ్ బద్దూరి బుజ్జి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు డేవిడ్, మండల సచివాలయాల కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు బంగారు అవకాశం

మాచర్ల: సంక్షేమ పథకాలకు జగనన్న సురక్ష బంగారు అవకాశం అని మున్సిపల్ చైర్మన్ తురక కిశోర్ అన్నారు. శనివారం మాచర్ల పట్టణంలోని నెహ్రూనగర్‌లో 1వ సచివాలయంలో ఆయన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పథకాలకు అర్హత కలిగిన వారంతా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది స్టాల్స్ ఏర్పాటు చేసి ఉచిత వైద్య పరీక్షలు చేసి, వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కౌన్సిలర్లు గట్ల అరుణ, రామిశెట్టి వెంకటేశ్వర్లు, నాగుల్‌మీరా, ఎంఆర్‌ఎఫ్ రామాంజనేయరెడ్డి, అల్లి జీవన్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించటమే జగనన్న సురక్ష లక్ష్యం

పిడుగురాళ్ల రూరల్: అర్హులందరికీ పథకాల ద్వారా లబ్ధి చేకూరాలనే లక్ష్యంతో జగన్న సురక్ష అనేక కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని జెడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకట కోటయ్య తెలిపారు. మండలంలోని గుత్తికొండ, జానపాడు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాల్ని నిర్వహించారు. ఆర్‌డీవో అద్దయ్య, తహసీల్దార్ చక్రవర్తి, ఎంపీడీవో కాశయ్య, మండల ప్రత్యేకాధికారి ఆంజనేయులు, ఎంఈవో రాజు, ఏపీవో మేరిజోత్స్న, ఈవోపీఆర్డీ శంకర్‌రావు, పంచాయతీ సెక్రటరీ స్వామినాయక్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై ప్రజల నుంచి హర్షం

దుర్గి: ప్రజల వినతులను సంతృప్తి స్థాయిలో పరిష్కరించటమూ, ఏ ఒక్కరూ మిగిలిపోకుండా అర్హులందరికీ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చే కార్యక్రమమే జగనన్న సురక్ష అని డెప్యూటీ కలెక్టర్ శ్రీరామచంద్రమూర్తి అన్నారు. అడిగొప్పల- 1 సచివాలయం పరిధిలో శనివారం క్యాంపు నిర్వహించారు. మొత్తం 308 ప్రజలు పాల్గొన్నారు. 154 మంది వివిధ సర్టిఫికెట్స్ కోరగా వాటిని పరిశీలించి 149ను అక్కడికక్కడే ప్రజా ప్రతినిధులు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏచూరి సాయి శంకర్, తహసీల్దార్ జి. రమేష్ కుమార్, ఎంపీడీవో కె సమతావాణి, స్పెషలాఫీసర్ సంజీవరావు, వైఎస్సార్ సీపీ నాయకులు రాయల మధు, షేక్ నాగూర్ బాషా పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ

మాచర్ల: పట్టణంలోని వార్డుల్లో శనివారం పింఛన్ల పంపిణీ ముమ్మరంగా సాగింది. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి, నిద్ర లేపి నగదు అందజేశారు. పలు వార్డుల్లో కార్పొరేటర్లు నగదు పంపిణీ చేశారు. నెహ్రూనగర్ 1వ వార్డులో కౌన్సిలర్ గట్ల అరుణ, వీఆర్వో కోటయ్య సచివాలయ అడ్మిన్, వలంటీర్‌తో కలసి పింఛన్లు పంపిణీ చేశారు.

పిడుగురాళ్లలో..

పట్టణంలోని వార్డుల్లో ఉదయం ఆరు గంటల కల్లా పింఛన్ పంపిణీ ప్రారంభమైంది. పలు వార్డులో కౌన్సిలర్లు, గృహ సారథులు, వలంటీర్లు లబ్ధిదారుల్ని ఆప్యాయంగా పలకరించి, నగదు అందజేశారు. గత ప్రభుత్వంలో నగదు పంపిణీకి, ప్రస్తుత ప్రభుత్వంలో పంపిణీకి గల తేడాని గమనించాలని సూచించారు. పట్టణంలోని ఆరో వార్డులో కౌన్సిలర్ అజ్మీర శారద వలంటీర్‌తో కలసి ప్రతి ఇంటికీ వెళ్లి నగదు అందజేశారు.

నేడు వాహనాలకు వేలం

దాచేపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం వాహనాలు వేలం పాట నిర్వహిస్తున్నట్లు సీఐ ఎ. సురేంద్రబాబు తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, లారీలకు సాయంత్రం 5గంటలకు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

సేంద్రియ ఎరువులతో భూసారం పెంపు

రెంటచింతల: సేంద్రియ ఎరువులైన పిల్లిపెసర, జీలుగ, జనుము వంటి పచ్చిరొట్ట పంటల్ని వేసి భూమిలో కలియదున్ని భూసారాన్ని పెంచుకోవాలని రైతులకు మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి సూచించారు. స్థానిక రైతుభరోసా కేంద్రంలో శనివారం వ్యవసాయ సహాయకులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల రైతులకు 20 శాతం వరకు ఖర్చు తగ్గుతుందని తెలిపారు.

పోలవరం నిర్వాసితుల సమస్యల్ని పరిష్కరించాలి

పిడుగురాళ్ల: పోలవరం నిర్వాసితుల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ జరుగుతున్న పాదయాత్రకు సంఘీభావంగా పిడుగురాళ్ల పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం నిధిని వసూలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల అనేక మంది నిర్వాసితులవుతున్నారన్నారు. వారికి వెంటనే పరిహారాన్ని అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు కె. సీతారామయ్య, భక్తుల రామారావు, మొగిలి ప్రతాప్, కంభ కొండలు, వత్తులు కోటేశ్వరరావు, దేవళ్ల వెంకటేశ్వర్లు, చల్లా పద్మ, మారతమ్మ పాల్గొన్నారు.

నేడు, రేపు సీపీఎం శిక్షణ తరగతులు

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గ సీపీఎం సభ్యులు, సానుభూతి పరుల శిక్షణ తరగతులు ఈ నెల 2,3 తేదీల్లో పిడుగురాళ్ల పట్టణంలోని కన్నెగంటి హనుమంతు భవనంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు తెలిపారు. పార్టీ ప్రముఖులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

వైద్యో దేవోభవ

మాచర్ల: జాతీయ డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని రోటరీ క్లబ్, వాసవీ క్లబ్, లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు, లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ, పీఎస్ఆర్ ఆంజనేయులు మీనాక్షి కంటి ఆసుపత్రి వైద్యులు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని పలువురు వైద్యుల్ని శాలువాలు, పూలమాలలు, బొకేలతో సత్కరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యులు పలువురు వైద్యుల్ని సన్మానించారు. వాసవీ క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవ రావు, మహిళా అధ్యక్షురాలు మేడా వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో సభ్యులు వైద్యుల్ని సత్కరించారు. పీఎస్ఆర్ ఆంజనేయులు మీనాక్షి కంటి ఆసుపత్రి వైద్యులు చిరుమామిళ్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆసుపత్రి వైద్యులను శాలువాలతో సత్కరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు అధ్యక్షుడు విడేల శ్రీనివాసరావు, సభ్యులు ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులను శాలువలు, పూల బొకేలతో సత్కరించారు.

పల్నాడు హాస్పటల్స్‌లో ....

పిడుగురాళ్ల: పట్టణంలోని పల్నాడు హాస్పిటల్‌లో శనివారం డాక్టర్స్ డే వేడుకల్ని అధినేత డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ నిర్వహించారు. డాక్టర్లు, సిబ్బందితో కలసి కేక్ కట్ చేశారు. డాక్టర్ రమ్య హారిక, సంజీవరెడ్డి, సందీప్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమాన్ని అందించేందుకే జగనన్న సురక్ష

మాచవరం: అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు జె.శివా యాదవ్ అన్నారు. మండలంలోని కొత్తపాలెం (ఆకురాజుపల్లి), చెన్నాయపాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష గ్రామ సభలు శనివారం నిర్వహించారు. కార్యక్రమాల్లో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, మండల ప్రత్యేక అధికారి శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీడీవో వర ప్రసాద్, తహసీల్దారు ప్రసాద్, ఈఓపీఆర్‌డీ వెంగళరావు, డీటీ సుబ్బారావు, గ్రామ పెద్దలు వెంకటరామయ్య, వట్టి రామిరెడ్డి, హనుమంతరావు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

పిడుగురాళ్ల రూరల్: మురుగు రహిత గ్రామమే లక్ష్యంగా డ్రైనేజీలను నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరాలపాడు చర్చి నుంచి గ్రామ సచివాలయం మెయిన్ రోడ్డు వరకు ఇరువైపులా రూ. 35 లక్షలతో జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. పనుల్ని వేగవంతంగా పూర్తి చేయాలని అధికారుల్ని ఆదేశించారు.

టీడీపీ బస్సు యాత్రలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి పరామర్శ

ఇటీవలే టీడీపీ బస్సు యాత్రలో మృతి చెందిన యరపగాని కోటేశ్వరరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కుటుంబానికి సహాయంగా రూ. 25 వేలతోపాటు, పిడుగురాళ్ల పట్టణంలో మూడు సెంట్ల స్థలం ప్రభుత్వం నుంచి అందిస్తామని తెలిపారు.

ఎంపీటీసీ మాజీ సభ్యురాలి మృతి

దాచేపల్లి: నడికుడి-4 ఎంపీటీసీ మాజీ సభ్యురాలు తోట లక్ష్మి(55) గుండెపోటులో శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. నారాయణపురంలోని ఆమె స్వగృహంలో గుండెపోటుకు గురికావడంతో కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కు తరలిస్తుండగా మృతి చెందారు. ఆమెకు భర్త వెంకటేశ్వర్లు, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

డెంగీ వ్యాధిపై అశ్రద్ధ వద్దు

రెంటచింతల: డెంగీ నిరోధక మాసోత్సవాలు సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి నేతృత్వంలో రెంటచింతలలో శనివారం ఆరోగ్య, ఆశా కార్యకర్తలు గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకుడు సీహెచ్. అంకమ్మరావు మాట్లాడుతూ ఆరోగ్య, ఆశా కార్యకర్తలు జులై 1 నుంచి 30 వరకు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఫ్రైడేను డ్రైడేగా పాటించాల్సిందిగా సూచించాలన్నారు. దోమల లార్వాలను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. హఠాత్తుగా వచ్చే తీవ్ర జ్వరం, భరించలేని తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం, చర్మంపై దద్దుర్లు, కనుగుడ్డు కదపలేనంతగా నొప్పి వంటి లక్షణాలు డెంగీ వ్యాధిగా అనుమానించి వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు. డాక్టర్ హేమ, సీహెచ్‌వో పూజల నాగేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు సీతారామిరెడ్డి, కాశీం, శిరీష , రంజాన్‌బీ పాల్గొన్నారు.

మోదీని గద్దె దింపాలి: సీపీఐ

దాచేపల్లి: దేశంలో కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని గద్దె దింపాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. నారాయణపురంలోని మందపాటి నాగిరెడ్డి కల్యాణ మండపంలో సీపీఐ పల్నాడు జిల్లా స్థాయిలో క్రియాశీలక నాయకులు, కార్యకర్తల సైద్ధాంతిక శిక్షణ తరగతుల్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో హిందూ, ముస్లిం అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటున్నారని, ఓట్ల కోసం ఈ వర్గాల మధ్య విద్వేషాలు పురిగొల్పుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసీ, ఇస్రో, రైల్వేలతో పాటు వ్యవసాయ రంగాన్ని అనిల్ అంబానీ, ఆదానీలకు కట్టబెట్టుతున్నారని ధ్వజమెత్తారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఉద్యమించాలని నాగేశ్వరరావు కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్, ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వి. రాధాకృష్ణ, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి గని, సీపీఐ సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, మండల కార్యదర్శి కొమెర వెంకట్రావ్ పాల్గొన్నారు.